సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



15,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: జలాశయానికి శనివారానికి 15,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, కండలేరు, కాలువలకు 6,555 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం 36.28 టీఎంసీలకు చేరుకుంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,870
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,695
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,896
నవర (8 గ్రాములు)	రూ.55,168

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

గాలిలో తేమ 87 శాతంగా శనివారం నమోదైంది. జిల్లాలో వాతావరణం ఆదివారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

795 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 795 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1,025 బేళ్లు వచ్చాయని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 98,790.6 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,83,27,369.70 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190 లభించింది. సగటు ధర రూ.286.74గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి సంరక్షణకు చర్యలు

- ఆక్రమణదారులపై చర్యలకు అధికారులు సిద్ధం
- వేంపాడులో భూమిని పరిశీలించిన దేవదాయశాఖాధికారులు



వేంపాడులో దేవాలయ భూమిని పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి/వరికుంటపాడు: వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ సర్వే నంబరు 78/1లో పామూరు శ్రీమదన వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన 6.08 ఎకరాల భూమిని శనివారం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్ పరిశీలించారు. ఆలయానికి చెందిన భూమిని అధికార పార్టీ నేతల అండతో టీడీపీ నేతలు ఆక్రమించి కంచె వేసిన విషయంపై ఆగస్టు 27 తేదీన 'రూ.15 కోట్ల భూమి హాంఫట్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు స్పందించారు. దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జాయింట్ కమిషనర్ (ల్యాండ్స్)చంద్రశేఖర్ అజాద్ ఆదేశాల మేరకు సదరు అధికారులు వేంపాడులో భూమి స్థితిని పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఈఓ నరసింహబాబును ఆదేశించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖ భూములు ఆక్రమించడం, అక్రమ రిజిస్ట్రేషన్లు చట్ట రీత్యా నేరమన్నారు. సాక్షిలో వచ్చిన కథనానికి జేసీ కే కార్తీక్ స్పందించి తహసీల్దార్ హూస్సేన్‌ను నివేదిక కోరారు. రెండు రోజుల క్రితం తహసీల్దార్ భూమిని పరిశీలించి నివేదిక పంపారు. ఈ భూమిని 22ఏ జాబితాలో ఉంచి రికార్డుల్లో శ్రీమదన వేణుగోపాలస్వామి పేరు మీద నమోదు చేసి పూర్తి స్థాయి రికార్డులను కోర్టుకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని జేసీ మండల అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

వెనామీ సీడ్.. బినామీ ఫ్రాడ్

రెండున్నర దశాబ్దాల క్రితం ఆక్వా రంగాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన టైగర్ రొయ్యల సాగును నాసిరకం సీడ్ పూర్తిగా కనుమరుగు చేసింది. ఇప్పుడు వెనామీ వంతైంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న హేచరీలు లోకల్ బ్రూడర్స్‌తో నకిలీ సీడ్ ఉత్పత్తి చేసి రైతులను దగా చేస్తున్నాయి. నాణ్యతలేని రొయ్య పిల్లలను అంటగడుతున్నాయి. చెరువులో పోసిన కొన్ని నిమిషాలకే సగం పిల్లలు చనిపోతుంటే.. మిగిలిన సగం వైరస్‌లతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి రైతులు అప్పుల పాలవుతున్నారు. పంట మధ్యలోనే హార్వెస్ట్ చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

- జిల్లాలో 69 హేచరీల్లో 18కే అనుమతి
- చర్యలు తీసుకోని మత్స్యశాఖ
- కృత్రిమ పద్ధతిలో వెనామీ రొయ్య పిల్లల ఉత్పత్తి
- నాసిరకం సీడ్‌తో పంట మధ్యలోనే హార్వెస్ట్ చేస్తున్న పరిస్థితి
- నష్టపోతున్న ఆక్వా రైతులు
- 34 వేల ఎకరాల్లో రొయ్యల సాగు
- ప్రశ్నార్థకరంగా మారుతున్న పరిణామాలు



కోడూరులో వైట్ స్పాట్‌తో చనిపోతున్న రొయ్యలు



తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు, వెంకన్నపాళెం పరిసర తీర గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వెనామీ ఆక్వా సాగులో ఉంది. నకిలీ సీడ్ కారణంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న పెనుమార్పులతో పాటు సీజనల్ వైరస్‌లు వెనామీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వైట్ స్పాట్‌తో పాటు అనేక అంతుచిక్కని వైరస్‌లతో అతలాకుతలం అవుతోంది. వీటి నియంత్రణకు ఖరీదైన యాంటీబయోటిక్స్, ప్రోబయోటిక్స్ వాడుతున్నా.. ఫలితం లేకపోవడంతో చెరువుల్లోని రొయ్యలు చెరువులోనే కుప్పలు కుప్పలుగా మృత్యువాత పడుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా తీరం వెంబడి ఆక్వా రంగం డాలర్లు పండించింది. తొలినాళ్లలో సిరులు కురిపించిన ఆక్వా రంగం తదనంతర కాలంలో నకిలీ సీడ్ హేచరీలు, ఫీడ్ వ్యాపారుల చేతిలో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. జిల్లాలో ఉలవపాళ్ల నుంచి మనుబోలు వరకు సముద్ర తీరంలో ఆక్వా సాగు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల్లో సాగైన ఆక్వా ప్రస్తుతం విభజిత జిల్లాలో కేవలం 34 వేల ఎకరాలకే సాగు పరిమితమైంది. సీడ్ నుంచి ఫీడ్, ప్రొబయోటిక్స్ వరకు నకిలీ, కల్తీలతో ఆక్వా రైతులను నట్టేటా మునిగిపోతుండడంతో ఆక్వా రంగం మనుగడను ప్రశ్నార్థకం చేసింది.

హేచరీల అత్యాశే శాపం

నాణ్యమైన రొయ్య పిల్లల ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా–2020) చట్టాన్ని తెచ్చింది. కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ ద్వారా అనుమతి పొందిన హేచరీలకు బ్రూడర్స్ అంటే తల్లి రొయ్యలను సరఫరా చేస్తోంది. తల్లి రొయ్య ద్వారా ఒక దఫాకు ఒక మిలియన్ సీడ్ ఉత్పత్తి అవుతోంది. ఒక బ్రూడర్‌తో 3, 4 సార్లు కంటే ఎక్కువ సార్లు గుడ్లు పెట్టించకూడదు. అంత కంటే ఎక్కువ సార్లు పెట్టిస్తే నాసిరకం పిల్లలు ఉత్పత్తవుతాయి. ఆరోగ్యంగా ఉన్న బ్రూడర్స్ రొయ్య నుంచి గుడ్లు పెట్టించి పొదిగించిన సీడ్ నాణ్యతగా ఉంటుంది. బ్రూడర్స్ నుంచి 1, 2, 3, 4 దఫాల్లో వచ్చిన రొయ్య పిల్లలు నాణ్యతతో పాటు పెరుగుదల ఒకే విధంగా ఉంటుంది. బ్రూడర్స్ కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ నుంచి కొనుగోలు చేయడానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. దీంతో హేచరీల యజమానులు అత్యాశకు పోయి కొన్ని రకాల మందులను వినియోగించి 10 నుంచి 12 సార్లు కృత్రిమంగా గుడ్లు పెట్టించి పిల్లలను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. మొదటి నాలుగు దశల్లో పొదిగించిన సీడ్‌తో 11, 12 దశల్లో వచ్చిన రొయ్య పిల్లలను కల్తీ చేసి రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. రైతుకు ఇచ్చిన రొయ్య పిల్లలు చెరువులో వదిలితే 50 శాతానికిపైగా చనిపోతున్నాయి.

సముద్ర రొయ్యలతో సీడ్ ఉత్పత్తి

అసలైన వెనామీ సీడ్ పేరుతో సముద్రంలో దొరికే రొయ్యలతో ఉత్పత్తి చేసిన నకిలీ సీడ్‌తో హేచరీలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. జిల్లాలో 69 హేచరీలు ఉంటే వీటిలో 18 హేచరీలకే కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ అనుమతి ఉంది. మిగతా హేచరీల్లో అనధికారికంగా సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. అనుమతి లేని హేచరీలకు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ బ్రూడర్స్ సరఫరా చేయకపోవడంతో వీరు సముద్రంలో దొరికే రొయ్యలను కొనుగోలు చేసి, వాటి ద్వారానే సీడ్ ఉత్పత్తి చేస్తున్నారని సమాచారం. ఇటువంటి హేచరీలు తాము కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ నుంచి గుడ్లు తెచ్చి పొదిగించామని, నేచురల్ (ఎకో) సీడ్, హైజెనిక్ (పరిశుభ్రమైన) సీడ్ అని రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు.

నష్టాల నుంచి బయటపడేందుకు..

ప్రతి పంటలో ఎదురవుతున్న పంట నష్టాల నుంచి బయటపడేందుకు రైతులు సామర్థ్యానికి మించి సీడ్ కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ఎకరా విస్తీర్ణానికి 30 వేల నుంచి 40 వేల వరకు రొయ్య పిల్లలను గుంతల్లో వదలవచ్చు. గుంతల్లో డెన్సిటీ తక్కువగా ఉండడంతో గ్రోత్ (సైజ్) బాగా ఉండేది. రానురాను సీడ్ నాణ్యత తగ్గిపోవడంతో లక్షల్లో సీడ్‌ను వదిలి పెడుతున్నారు. ప్రస్తుతం వెనామీ సాగు కనుమరుగు దశకు చేరుకుంటుందని ఆక్వా నిపుణులు చెబుతున్నారు.

ఆక్వా ఊపిరి తీస్తున్న ఫీడ్ కంపెనీలు, వ్యాపారులు

జిల్లాలో ఆక్వా రంగం ఊపందుకోవడంతో ఫీడ్ కంపెనీలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువునా ముంచేయడంతో ఆక్వా రంగం కొన ఊపిరితో కునారిల్లుతోంది. వ్యాపారులే మార్కెటింగ్ ఏజెంట్లను పెట్టుకుని, వీరే టెక్నీషియన్లు అని చెప్పి ఫీల్డ్‌లోకి పంపిస్తున్నారు. వీరికి కనీస అవగాహన కూడా ఉండడం లేదు. వీరు అవసరం లేకపోయినా.. గ్రోత్ కోసం, జీర్ణశక్తి మెరుగు పరిచేందుకు, బాక్టీరియా, అమ్మోనియా లోడ్ కంట్రోల్, విటమిన్ సీ, మినరల్స్, మౌల్టింగ్ త్వరగా అయ్యేందుకు, ఆక్సిజన్ వినియోగం పెరిగేందుకు, హెల్త్ అండ్ వెయిట్ ఇంప్రూవ్‌మెంట్ సప్లిమెంట్స్, రొయ్య రంగు బాగుండేందుకు, రొయ్యల చెరువుల్లో నీళ్ల రంగు వచ్చేందుకు, మేత వినియోగం మెరుగు పరిచేందుకు అంటూ ఇలా రకరకాల పేర్లతో మందులు అంటగడుతున్నారు. ఆక్వా ఫీడ్ తయారీలో పేరెన్నికగన్న సంస్థలు కూడా సీజన్‌ను, డిమాండ్‌ను బట్టి నాసిరకం మేతలు సరఫరా చేస్తున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు. నాణ్యత లేని సీడ్, వాతావరణ మార్పుల కారణంగా ఎదుగుదల ఏ మాత్రం నెమ్మదించినా విపరీతంగా మందులు వాడుతున్నారు. చివరకు దుకాణాల్లో అప్పులు పెరిగి ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితికి చేరుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు

నకిలీ సీడ్, నాసిరకం ఫీడ్, మెడిసిన్స్‌తో ఆక్వా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్సడా–2020 చట్టాన్ని రూపొందించింది. కోస్టల్ ప్రాంతాల్లో సీడ్, ఫీడ్ నాణ్యతను గుర్తించేందుకు ఆక్వా ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా కొంత కాలంగా నకిలీ సీడ్, ఫీడ్ విక్రయాలకు కళ్లెం పడింది. అధికారుల పర్యవేక్షణ కూడా తరచూ కొనసాగింది. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. నకిలీ బెడద మళ్లీ మొదటికే వచ్చింది.

జిల్లాలోనే నకిలీ ప్రొడక్ట్స్

కొందరు వ్యాపారులు నెల్లూరు, కోవూరు పరిసర ప్రాంతాల్లో అద్దె భవనాలు ఏర్పాటు చేసుకుని ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల నుంచి ముడి సరుకులు తీసుకువచ్చి గోడౌన్లలో అందమైన కవర్లు, డబ్బాల్లో ప్యాక్ చేసి రైతులకు అంటగడుతున్నారు. తీరం వెంబడి ఆక్వా సాగు చేసే గ్రామాల్లోనే మేత, మందులు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేస్తారు. కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సీడ్ దగ్గర నుంచి మేత, మందులు, జనరేటర్లు, డీజిల్ వరకు చిన్నరైతులకు అప్పుగా ఇస్తారు. పంట పట్టుబడికి వచ్చిన తర్వాత వీళ్లే రొయ్యలు విక్రయించి తమ బాకీ జమ చేసుకుని మిగిలిన సొమ్ము రైతులకు ఇస్తారు. తమ ఉత్పత్తులను ఎమ్మార్పీ ధరల్లో 50 నుంచి 60 శాతం కమీషన్‌గా ఇస్తున్నాయి. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ ఆదేశాల మేరకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబరు 2 ప్రకారం 20 రకాల యాంటీబయోటిక్స్ వాడకాన్ని పూర్తిగా నిషేధించింది. అయితే దీంతో నకిలీ మందులనే విషయం వ్యాపారులకు తెలిసినా కమీషన్‌కు కక్కుర్తిపడి చిన్న రైతులకు అంటగడుతున్నారు.

వైట్‌స్పాట్ అధికంగా ఉంది



వెనామీ సాగుకు వైరస్‌ల బెడద అధికంగానే ఉంది. ముఖ్యంగా వైట్ స్పాట్ చెరువుల్లోని రొయ్యలను అంతులేకుండా చేస్తున్నాయి. వైట్‌స్పాట్‌తో పాటు మిగిలిన వైరస్‌లకు వేలకు వేలు ఖర్చులు పెట్టి మందులు వినియోగిస్తున్నా.. ఫలితం లేదు. చెరువుల్లో పోసిన రొయ్యలు మేత తింటున్నాయే తప్పా పెరగడం లేదు. ఈ పరిస్థితిలో వెనామీసాగు కష్టమవుతోంది.

– ఊటుకూరు శ్రీనివాసులు, ఆక్వారైతు, కోడూరు

మంచి మందులు అందుబాటులో లేవు



వెనామీకి సోకుతున్న వైరస్‌ల నుంచి రక్షించుకొనేందుకు అనేక రకాల ఖరీదైన మందులను వినియోగిస్తున్నాం. ఖర్చు అవుతుందే తప్ప.. ఫలితం ఉండడంలేదు. నాసిరకమైన ఈ మందులు వెనామీకి సోకుతున్న వైరస్‌లను నియంత్రించ లేక రూ.లక్షల్లో నష్టపోతున్నాం.

– పొమంజి దుర్గ, ఆక్వా రైతు, కోడూరు

అనధికార హేచరీలపై చర్యలు

జిల్లాలో కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ అనుమతిలేని హేచరీలు చాలానే ఉన్న విషయం నిజమే. ఆయా హేచరీ యజమానులకు అనుమతులు తీసుకోవాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఇటీవల అనధికార హేచరీలను పరిశీలించి సీడ్ తయారీలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశాం. అనధికార హేచరీలపై చర్యలు తప్పవు.

– నాగేశ్వరరావు, ఫిషరీస్ జేడీ

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అన్ని శాఖల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల నిర్వహణ సంస్థ సెప్టెంబర్ 3వ తేదీ వరకు భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల వల్ల ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తక్షణ సహాయం కోసం ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ట్రోల్ ఫ్రీ సంబరు 0861-2331261/1077కు తెలియజేయాలన్నారు. కలెక్టరేట్‌లోని 24 గంటలు మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. జిల్లా అధికారులు కార్యాలయాల్లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జిల్లాలో ఎక్కడైనా వర్షాల వల్ల పంటలు కాని, ఇతర నష్టాలు కాని సంభవించినట్లయితే ప్రతి రోజు కలెక్టరేట్‌కు నివేదిక పంపాలని కలెక్టర్ తెలిపారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

- వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కలెక్టర్ ఆనంద్



కలెక్టర్ ఆనంద్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

నెల్లూరు సిటీ: కేంద్ర ప్రభుత్వం తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక ప్రాజెక్ట్ ప్రసాద్ స్కీమ్ ద్వారా వేదగిరిపై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నరసింహకొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని టూరిజం అధికారులతో కలిసి కలెక్టర్ శనివారం సందర్శించారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన కలెక్టర్ ఆలయ పరిసరాలను పరిశీలించి ఏఏ అభివృద్ధి పనులు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో రాగిపూత, శ్లాబ్ నిర్మాణ పనులు, అన్నదానసత్రం విస్తరణ, భక్తుల విశ్రాంతి హాలు, టికెట్ కౌంటర్, క్లాక్ రూం, క్యూలైన్ల ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం, ఆలయ సమీపంలోని దశావతారాల విగ్రహాల వద్ద పార్కుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రసాద్ స్కీం ద్వారా రూ.18.90 కోట్లు కేంద్రం మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆలయంలో అవసరమైన పనులకు తొలుత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులు, ఆలయ అర్చకులు, ట్రస్టు బోర్డు సభ్యులతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా భక్తుల కనీస అవసరాలపై దృష్టి పెట్టి పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయంలో భక్తులకు నీటి సమస్య లేకుండా శాశ్వతంగా పరిష్కరించేదుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

నరసింహుడిని దర్శించుకున్న కలెక్టర్

అనంతరం కలెక్టర్ వేదగిరిపై కొలువైన నరసింహుడిని, ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీనివాసరావు, డీఈ వంశీకృష్ణ, ఆలయ ఈఓ సుధీర్ తదితరులున్నారు.

ట్రాక్టర్ కొనుక్కో.. ఇసుక తోలుకో..!

తెలుగు తమ్ముళ్ల కొత్త పంథా

➡ రమణయ్య: ఏం రంగయ్య ఎలా ఉన్నావ్... చాలా రోజులకు కనిపించావు. ఏం చేస్తున్నావ్.

➡ రంగయ్య: ఏముంది రమణయ్య ప్రభుత్వం మారిందిగా... వర్షాలు కూడా పడే పరిస్థితి కనిపించడం లేదు. రైతు భరోసా కూడా ఇక ఉండదేమో.

➡ రమణయ్య: అవును...అలానే కనిపిస్తుంది పరిస్థితి. ఈ ఏడాది రైతు భరోసా లేనట్లే. ఏదో ఒకటి చేసుకుంటేనే బతకగలం.

➡ రంగయ్య: నా పరిస్థితీ అలానే ఉంది. సేద్యం చేద్దామా... వద్దా అన్నట్లు ఉంది. అసలు అర్థం కావడం లేదు. నువ్వు ఏమి చేస్తున్నావ్

➡ రమణయ్య: నేనా.. ఒక ట్రాక్టర్ కొన్నాను. ఇసుక తోలుకుంటున్నాను.

➡ రంగయ్య: అదేంటి ఇసుకకు పర్మిషన్ లేదు కదా... పట్టుకోవడం లేదా..?

➡ రమణయ్య: అదేముంది రంగయ్య... అధికారులకు నెలకు ఇంతని లంచం ఇస్తే చాలు మన జోలికి రారు. రోజుకి 8 నుంచి 10 ట్రిప్పులు తోలుకుంటున్నాను. ట్రాక్టర్ అప్పు కూడా త్వరగా తీరిపోతుంది.

➡ రంగయ్య: అవునా..! అది ఎలా?

➡ రమణయ్య: ఒక ట్రిక్కు ఇసుక రూ.2వేల నుంచి రూ.3వేల వరకు దూరాన్ని బట్టి తోలుతున్నా. రూ.500 కూలీలకు. రూ.500 నుంచి రూ.700 ఆయిల్ ఖర్చు పోయినా ట్రిక్కుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు మిగులుతాయి. రోజుకు ఐదు నుంచి పది ట్రిపులు తోలుతా. ట్రిప్పునకు రూ.1,000 చొప్పున మిగిలినా నెలకు రూ.2 లక్షల వరకు సంపాదించుకోవచ్చు. కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేసినా ట్రాక్టర్ డబ్బులు నాలుగైదు నెలల్లో సంపాదించుకోవచ్చు. నువ్వు కూడా ఒక ట్రాక్టర్ తీసుకో. డబ్బులు లేకపోతే ఈఎంఐలో కొనుగోలు చేసుకో. లేదా అప్పు చేసి కొనేసెయ్.



రంగయ్య: అవునా ఇదేదో బాగానే ఉందే. ట్రాక్టర్ పట్టుకుంటే కేసు పెడుతున్నారంట కదా... జరిమానాలు కట్టాలంటగా.

➡ రమణయ్య: అది ప్రతిపక్ష పార్టీ వారికి మాత్రమే. అధికార పార్టీ నాయకులతో చెప్పించుకుంటే చాలు. అధికారులకు నెలకు రూ.15వేలు లంచం ఇస్తాం. వారి వద్ద మన బండి నంబర్ ఉంటుంది. ఎవరు ఫోన్ చేసి చెప్పినా మన జోలికి రారు.

➡ రంగయ్య: ఇదంతా రిస్క్‌తో కూడిన పని కదా రమణయ్య. అయినా అధికారులు, నాయకులతో ఇబ్బంది కదా..

➡ రమణయ్య: అదంతా మనం చూసుకుందాం. ఇప్పుడు వ్యవసాయం మీద ఏం వస్తుంది. ఒక ట్రాక్టర్ కొనుక్కుంటే చాలా హాయిగా సంపాదించుకోవచ్చు. మా ఊర్లో ఇప్పటికే నాలుగైదు ట్రాక్టర్లు కొత్తవి కొనుగోలు చేశారు. మరో నలుగురు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

రంగయ్య: నేను ఒక ట్రాక్టర్ కొనుక్కుంటాను సాయం చేస్తావా.

➡ రమణయ్య: తప్పకుండా నాయకులతో మాట్లాడి మన ట్రాక్టర్లను పట్టుకోకుండా చేయిస్తాం. అవకాశం ఉన్నప్పుడే సంపాదించుకోవాలి.

➡ రంగయ్య: అలాగే నీ మాట మీద ట్రాక్టర్ తీసుకుంటా. మళ్లీ కలుద్దాం..



కందుకూరు మండలం దొండపాడులో ఇసుక కోసం కొనుగోలు చేసిన కొత్త ట్రాక్టర్



దొండపాడు వద్ద మన్నేరులో ఇసుక తవ్వకాలు చేసిన ప్రాంతం

- పోటీపడి ట్రాక్టర్ల కొనుగోలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- నెలల్లోనే రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్న వైనం
- మామూళ్ల మత్తులో అధికారులు
- భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతుల ఆందోళన

కందుకూరు రూరల్: కందుకూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయల్లా సాగుతోంది. టీడీపీ నాయకులకు ఇసుక కాసులు వర్షం కురిపిస్తుండడంతో కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నారు. లింగసముద్రం మండలంలో కేవలం ఇసుక తరలించేందుకు సుమారు 20 ట్రాక్టర్ల వరకు నూతనంగా కొనుగోలు చేశారు. లింగసముద్రం మండలం మన్నేరు పరీవాహక ప్రాంతాలైన మొగిలిచర్ల, అన్నేబోయినపల్లి, వీఆర్‌కోట, ఉప్పుటేరు ప్రాంతాలైన పెదపవని, చినపవని, ముత్యాలపాడు గ్రామాల నుంచి కావలి, కందుకూరు, వలేటివారిపాళెం, పామూరు, లింగసముద్రం ప్రాంతాలకు ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.6వేలకు తరలిస్తున్నారు. అంతే కాకుండా కావలి నుంచి 30 ట్రాక్టర్ల వరకు ఈ ప్రాంతాలకు వచ్చి ఇసుకను తరలిస్తున్నారు. ఇలా రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలి వెళుతోంది. ఎవరైనా అధికారులకు సమాచారం ఇస్తే వచ్చి అడపాదడపా పట్టుకుంటున్నారు. వెంటనే జరిమానా చెల్లించి నేరుగా ఇసుక తరలించేందుకే తీసుకెళ్తున్నారు. ఇలా పట్టుకోవడం వదిలేయడం పరిపాటిగా మారింది.

అధికారులు పట్టుకుంటే...

ఒక్కోసారి ట్రాక్టర్లను పట్టుకున్న సమయంలో నాయకులు వచ్చి అధికారులపై చిందులేస్తున్నారు. ఇటీవల గుడ్లూరు సీఐ మంగారావు ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇవి మా ట్రాక్టర్లు వదిలేయాలని వలేటివారిపాళెంకు చెందిన టీడీపీ నాయకులు గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. వలేటివారిపాళెం మండలం కళవళ్ల వద్ద ఇసుక ట్రాక్టర్లు రైతు పొలంలో నుంచి బయటకు రావాల్సి ఉంది. అయితే ట్రిప్పునకు రూ.100 ఇస్తేనే ట్రాక్టర్‌ను పొలంలో నుంచి పోనిస్తామని నిలబెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు.

మండలంలోని పాలూరు, దొండపాడు, మదనగోపాలపురం, మాచవరం, పందలపాడు, విక్కిరాలపేట, వెంకన్నపాళెం గ్రామంలో మన్నేరు, పాలేరుల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఒక పాలూరు, దొండపాడు గ్రామాల్లోనే 20 ట్రాక్టర్లు రోజూ ఇసుకను తరలిస్తున్నాయి. ఇసుక కోసమే దొండపాడులో నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నారంటే ఆదాయం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో ట్రాక్టర్ ద్వారా రోజుకు 8 నుంచి 10 ట్రిప్పులు ఇసుకను తరలిస్తున్నారు. కందుకూరు టౌన్‌కు అయితే రూ.2,500 తీసుకుంటున్నారు. అదే కందుకూరు దాటి గ్రామాలకైనా రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. ఇలా ట్రాక్టర్ల యజమానులు నెలకు రూ.లక్షలు కూడగట్టుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే గుడ్లూరు మండలం గుండ్లపాళెం, వలేటివారిపాళెం మండలం కళవళ్ల ప్రాంతంలో ఉండేది నాణ్యమైన ఇసుకగా చెప్తారు. ఈ ఇసుక ఇళ్ల శ్లాబుకు ఎక్కువగా వాడుతుంటారు. ఈ ప్రాంతం నుంచి ఇసుక కావాలంటే కందుకూరుకు రూ.3500 తీసుకుంటున్నారు.

3 నెలల్లో 150 ట్రాక్టర్ల విక్రయం

కందుకూరు పట్టణంలోని ట్రాక్టర్ల షోరూంల నుంచి గత మూడు నెలల్లో దాదాపు 150 ట్రాక్టర్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. వీటిలో సగంపైగా ట్రాక్టర్లను టీడీపీ మద్దతుదారులే కొనుగోలు చేశారని అంటున్నారు. కొందరు డబ్బు చెల్లించి, మరికొందరు వాయిదాల రూపంలో వాటిని కొనుగోలు చేశారు. వాటిలో ఎక్కువ వాటిని ఇసుక తోలకానికే వినియోగిస్తున్నారని తెలుస్తోంది.

భూగర్భ జలాలపై రైతుల ఆందోళన

ఇదిలా ఉంటే ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలేరు, మన్నేరు పరీవాహక ప్రాంతాల్లో మంచినీటి పథకాల బోర్లు, వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఇసుక తవ్వకాల వల్ల బోర్ల నీరు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అక్రమ మార్కులకు అండగా ఉంటూ వారి జేబులు నింపుకునేందుకు సహకరిస్తున్నారు. తాగేందుకు మంచినీరు లేకపోయినా, వ్యవసాయానికి నీరు లేకపోయినా వారికి పట్టడం లేదు.

కావలికి చెందిన సుబ్బారావుకు ఒక ప్రముఖ బ్యాంక్ పేరిట వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది. ఆధార్, పాన్ అనుసంధానం చేయని కారణంగా బ్యాంక్ ఖాతాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, పాన్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరస్తులు సూచించిన యాప్‌ను ఇన్‌స్టల్ చేసిన వెంటనే ఓటీపీలు రావడంతో పాటు బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.12 వేలు పోయాయి.

కావలి పట్టణానికి చెందిన ఓ న్యాయవాదికి తన ఖాతా ఉన్న బ్యాంక్ పేరిట వాట్సాప్ మెసేజ్ వచ్చింది. పాన్‌కార్డ్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటూ యాప్ లింక్‌ను పంపారు. యాప్‌ను ఇన్‌స్టల్ చేసిన వెంటనే ఖాతాలో డబ్బులు మాయమవ్వడంతో పాటు వాట్సాప్ కూడా బ్లాకైపోయింది. ఇలాంటి ఘటనలు ఈ ఇద్దరికే కాదు.. ఎంతో మంది ఈ వలలో పడి మోసపోతున్నారు.

క్లిక్ చేశారా.. నగదు గల్లంతే

- విచ్చలవిడిగా ఫేక్ యాప్స్
- బురిడీ కొట్టిస్తున్న సైబర్ నేరస్తులు
- బ్యాంకింగ్ వివరాలు, సున్నిత సమాచార తస్కరణ



కావలి / బిట్రగుంట: సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని నకిలీ బ్యాంకింగ్ యాప్‌లతో అమాయకుల బ్యాంక్ ఖాతాలను కొల్లగొడుతున్న ఘటనలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. దాదాపుగా అన్ని ప్రముఖ బ్యాంక్‌ల పేరుతో ఈ నకిలీ యాప్‌లు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. ఆధార్, పాన్‌కార్డ్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటూ ఈ క్లోన్ యాప్‌లతో సామాన్యులకు సైబర్ నేరస్తులు గాలమేస్తున్నారు. యాప్‌ను ఇన్‌స్టల్ చేసిన వెంటనే ఫోన్లోని ఎస్సెమ్మెస్, కాల్‌లాగ్స్, కాంటాక్ట్ లిస్ట్ సైబర్ నేరస్తుల చేతికి చేరుతోంది. ఈ వివరాల ఆధారంగా బాధితుడి ఫోన్లోని ఫోన్‌పే, గూగుల్‌పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను వినియోగించి బ్యాంక్ ఖాతాలోని సొమ్మును కొల్లగొడుతున్నారు. యాప్‌ను ఇన్‌స్టల్ చేసిన నిమిషాల వ్యవధిలోనే ఖాతాలోని సొమ్మును మాయం చేస్తున్నారు. ఈ తరుణంలో ఏమి చేయాలో పాలుపోక బాధితులు ఆందోళనకు గురవుతున్నారు.

మోసం చేసేది ఇలా..

రాజస్థాన్‌లోని భరత్‌పూర్, అల్వార్, ఉత్తరప్రదేశ్‌లోని మధుర, హరియాణాలోని నుహ్, గురుగ్రామ్, జార్ఖండ్‌లోని దియోగఢ్, జాంతారా, బొకారో, గిరిధ్, తదితర ప్రాంతాలకు చెందిన సైబర్ ముఠాలు దేశమంతా విస్తరించాయి. తొలుత ఫోన్ కాల్స్ ద్వారా అమాయకులను బురిడీ కొట్టించి ఓటీపీలను తెలుసుకోవడం ద్వారా ఈ ముఠాలు నేరాలకు పాల్పడేవి. అయితే ప్రస్తుతం నకిలీ యాప్‌ల ద్వారా విరుచుకుపడుతున్నాయి. ప్రముఖ బ్యాంక్‌ల పేరుతో నకిలీ యాప్‌లను సృష్టించి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నాయి. వీటిని ఇన్‌స్టల్ చేసిన వెంటనే బాధితుల ఫోన్లోని సున్నిత సమాచారమంతా సైబర్ నేరస్తుల సర్వర్‌కు చేరుతోంది. ఈ వివరాల ఆధారంగా బాధితుడి ఫోన్లోని పేమెంట్ యాప్స్, నెట్ బ్యాంకింగ్‌ను యాక్సెస్ చేస్తూ ఖాతాలోని సొమ్మును కొల్లగొడుతున్నారు. అంతే కాకుండా బాధితుడి వాట్సాప్ నుంచే అతని వాట్సాప్ గ్రూపులు, కాంటాక్ట్ లిస్ట్‌కు నకిలీ సందేశాలు పంపుతున్నారు. కావలిలోని సుమారు 100 వాట్సాప్ గ్రూపులు శుక్రవారం ఒక్కరోజే నకిలీ యాప్‌ల బారిన పడ్డాయి.

అవగాహనతోనే అడ్డుకట్ట

సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారానే అడ్డుకట్ట వేయొచ్చని నిపుణులు చెప్తున్నారు. సోషల్ మీడియా పోస్టులే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి

సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. ఆఫర్లు, శుభాకాంక్షల పేర్లతో వెబ్‌సైట్ లింకులొస్తే కచ్చితంగా అనుమానించాల్సిందే. అవసరమైన యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా వచ్చే థర్డ్ పార్టీ యాప్‌లను ఇన్‌స్టల్ చేసుకోకూడదు. ఆధార్, పాన్ అప్‌డేషన్‌తో పాటు తక్కువ వడ్డీకే రుణాలిస్తామని వచ్చే ఫోన్‌కాల్స్‌ను విశ్వసించొద్దు. ట్రాయ్ లేదా సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీపై కేసు నమోదైందని వచ్చే కాల్స్‌ను పట్టించుకోకపోవడమే మేలు.

దుర్వినియోగం..

- ఫోన్లను హ్యాక్ చేయడం ద్వారా ఓటీపీలను తస్కరించి బాధితుడి బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయడంతో పాటు ఆధార్, పాన్‌కార్డు, కాంటాక్ట్ లిస్ట్‌లోని ఫోన్ నంబర్లనూ దుర్వినియోగం చేస్తున్నారు.
- బాధితుడి ఆధార్, పాన్ కార్డును వినియోగించి ఆన్‌లైన్లో తాత్కాలిక బ్యాంక్ ఖాతాలు తెరవడం, లోన్‌యాప్స్‌లో వీటి ఆధారంగా రుణాలు తీసుకుంటున్నారు.
- మరోవైపు బాధితుడి ఫోన్ నంబర్ ఆధారంగా అతని వాట్సాప్‌కు న్యూడ్ వీడియో కాల్స్ చేస్తున్నారు. ఒక వేళ వీటికి మోసపోతే స్క్రీన్‌షాట్లు తీసుకుంటున్నారు. వీటిని బాధితుడికే పంపి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పట్టించుకోకపోతే కాంటాక్ట్ లిస్ట్‌లోని నంబర్లను అతనికే పంపి, వీరందరికీ స్క్రీన్‌షాట్లు పంపుతామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పరువు పోతుందనే భయంతో సైబర్ నేరస్తులు అడిగినంత మొత్తాన్ని చెల్లిస్తున్నారు.

సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్షలు

- మిస్సింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని పోలీస్ కార్యాలయంలో గల మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం నిర్వహించారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్ తదితర కేసులను సర్కిళ్ల వారీగా సమీక్షించారు. పలు కేసులు పెండెన్సీలో ఉండటంతో వాటికి గల కారణాలను తెలుసుకొని.. తగ్గించేందుకు అవసరమైన సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసుల దర్యాప్తులో పారదర్శకతే ప్రామాణికమని చెప్పారు. కేసుల నమోదు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వరకు లోతుగా దర్యాప్తు చేసి కోర్టులో అభియోగపత్రాలను త్వరితగతిన దాఖలు చేయాలని సూచించారు.

ప్రజలతో మమేకం కావాలి

పల్లెనిద్ర పేరిట డీఎస్పీ నుంచి ఎస్సై వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్లోని గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకం కావాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలు, సైబర్ నేరాలు, నేర నియంత్రణ, మహిళలు, బాలికల రక్షణ చట్టాలతో పాటు మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. పోక్సో, మహిళలకు సంబంధించిన కేసుల్లో నిర్ణీత గడువులోపు కోర్టులో చార్జిషీట్‌లను దాఖలు చేయాలన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏహెచ్‌టీయూ, సైబర్, ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో సాంకేతికత ఆధారంగా మహిళలు, బాలికలు, వృద్ధుల మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్‌స్పాట్ల వద్ద వార్నింగ్ సిగ్నల్ లైట్లు, సూచిక బోర్డులు, స్టాపర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వాహన తనిఖీలు ముమ్మరం

విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలను ముమ్మరం చేసి నేరాలు జరగకుండా చూడాలని కోరారు. దొంగతనం కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేయాలని చెప్పారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు, జైలు నుంచి బయటకొచ్చే నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులను ముమ్మరం చేసి నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా పరిష్కార వేదికలో అందే ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏఎస్పీ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కుళ్లబొడుస్తూ..

- చేజర్ల మండలంలో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు
- ఆపై ఇటుక బట్టీలకు విక్రయాలు
- రోజూ రూ.లక్షల్లో వసూళ్లు
- మామూళ్ల మత్తులో అధికారులు



చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గంలోని చెరువులను తెలుగు తమ్ముళ్లు కొల్లగొడుతున్నారు. అనుమతుల్లేకుండానే మట్టిని తవ్వేస్తూ.. వందల ట్రాక్టర్లలో తరలించి జేబులు నింపుకొంటున్నారు. ఈ వ్యవహారం యథేచ్ఛగా జరుగుతున్నా, మామూళ్ల మత్తులో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జోగుతున్నారు.

నిత్యం ఇంతే..

చేజర్ల మండలంలోని మడపల్లి చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించి రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ చెరువులో యంత్రాలను ఉపయోగిస్తూ వారం రోజులుగా నిత్యం 50కు పైగా ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా కొట్టాలు, గొల్లపల్లి వద్ద గల ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈ తరుణంలో చెరువుల్లో భారీ గుంతలు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా వెనుకేసుకుంటున్న వైనం

మట్టిని తరలించడం ద్వారా టీడీపీ నేతలు రోజుకు రూ.రెండు లక్షల వేరకు వెనుకేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల్లో పూడికతీత పేరుతో ఐదు వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసి రైతుల పొలాల్లోకి తోలుకునేందుకు అనుమతులంటూ ఇరిగేషన్ అధికారులను వీరు మేనేజ్ చేస్తున్నారు. అయితే అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రమణరావును సంప్రదించగా, మట్టి తరలింపు అంశం తమ పరిధిలోకి రాదంటూ సమాధానాన్ని దాటేశారు.

క్లుప్తంగా

95 శాతం పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ ఆనంద్



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో తొలి రోజు 95 శాతం మేర పింఛన్లను పంపిణీ చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సెప్టెంబర్ ఒకటి ఆదివారం సెలవు కావడంతో శనివారమే పంపిణీని చేపట్టామని చెప్పారు. రాత్రి ఏడు గంటల సమయానికి 95 శాతం మేర లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశామని చెప్పారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, రాపూరు మండలాల్లో 96 శాతానికిపైగా పంపిణీ చేశామని వివరించారు. మిగిలిన వారికి సోమవారం అందజేయనున్నామని చెప్పారు. నగరంలోని మూలాపేటలో గల పొట్టి శ్రీరాములు విగ్రహ సమీపంలో పింఛన్లను కలెక్టర్ పంపిణీ చేశారు.

నేటి గూడూరు - విజయవాడ మెమూ రద్దు

నెల్లూరు(క్రైమ్): భారీ వర్షాల నేపథ్యంలో గూడూరు నుంచి విజయవాడ వెళ్లే (07458) మెమూ రైలును ఆదివారం రద్దు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు. దీనికి సంబంధించి 78159 09469 హెల్ప్ లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.190
స్కిన్‌లెస్ చికెన్:	రూ.212
లేయర్ చికెన్ :	రూ.178



నిమ్మ ధరలు

పెద్దవి :	రూ.100
సన్నవి :	రూ.50
పండ్లు :	రూ.30

టీడీపీ నేతల బరితెగింపు

- అనుమతి లేకుండా నల్లతుమ్మ చెట్ల నరికివేత
- పోలీసులకు సెక్రటరీ ఫిర్యాదు



చెరువులో నల్లతుమ్మ చెట్లను నరుకుతున్న కూలీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేతల బరితెగింపునకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. అడిగే వారు లేరనే ధీమాతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. పొదలకూరు పట్టణానికి సమీపంలో ఉన్న చెరువులో పంచాయతీ తరఫున పెంచుతున్న నల్లతుమ్మ చెట్లను ఆ పార్టీ నేతలు విక్రయించి సొమ్ముచేసుకోవడమే కాకుండా వాటిని నరికి తరలించే పనిని మరొకరికి అప్పగించారు. ఈ తంతు జరిగి నాలుగు రోజులైంది. ఆలస్యంగా గుర్తించిన పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్.. మిగిలిన నల్లతుమ్మ కర్ర తరలిపోకుండా అడ్డుకున్నారు.

పంచాయతీకి ఆదాయం

గతంలో సైతం ఈ చెట్ల వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరింది. దీంతో సంరక్షణ బాధ్యతను పంచాయతీ నిర్వాహకులు తీసుకున్నారు. ఈ తరుణంలో చెరువులోని నల్లతుమ్మ చెట్లను నరికి కర్రను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం సర్పంచ్ మల్లిక చిట్టెమ్మకు అందింది. దీంతో ఆమె చెరువు వద్దకెళ్లి చెట్లను నరుకుతున్న కూలీలను అడ్డుకున్నారు. పంచాయతీలో వేలాన్ని నిర్వహించి నిబంధనల మేరకు అప్పగిస్తేనే నరకాల్సి ఉంటుందని చెప్పి, వెంటనే నిలిపేయించారు. అప్పటికే కొంతమేర కర్రను తరలించారని సమాచారం. పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత.. నల్లతుమ్మను మరొకరికి రూ.1.5 లక్షలకు విక్రయించారని తెలుస్తోంది. ఘటనపై పొదలకూరు పంచాయతీ సెక్రటరీ దుర్గాదొరబాబు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాపూరు బాబు తండ్రి లక్ష్మయ్య, మరికొందరు కలిసి నల్లతుమ్మ చెట్లను గత నెల 27న నరుకుతుండగా, పంచాయతీ సిబ్బంది ద్వారా గుర్తించామని పేర్కొన్నారు.

నవోదయ విద్యాలయానికి పురస్కారం



అవార్డును అందుకుంటున్న చెన్నయ్య

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయానికి అత్యున్నత గృహ పురస్కారం లభించింది. ఎయిర్ క్వాలిటీ, ఎనర్జీ.. వాటర్.. వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రమాణాల ఆధారంగా అర్హులను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓ బృందం ఎంపిక చేస్తుంది. వీటన్నింటిలో కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయం 45 – 50 పాయింట్లను సాధించి 5 స్టార్ రేటింగ్‌ను పొందింది. దీంతో విద్యాలయ బయాలజీ ఉపాధ్యాయుడు చెన్నయ్యకు పురస్కారాన్ని హైదరాబాద్‌లో శుక్రవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గౌసియాబేగం మాట్లాడారు. ఈ పురస్కారం విద్యాలయ కీర్తిని ఇనుమడింపజేసిందని, పర్యావరణ ఇతర అంశాలపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

డివిజన్	కంట్రోల్ రూమ్ నంబర్
విద్యుత్ భవన్	94408 17468
నెల్లూరు రూరల్	93818 15083
నెల్లూరు టౌన్	79016 42857
కోవూరు	83280 82583
కావలి	79010 56437
ఆత్మకూరు	79010 56906

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): భారీ వర్షాల నేపథ్యంలో ఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్‌కు నోడల్ ఆఫీసర్‌గా చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్యను నియమించారని ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఈఈలు, డీఈఈలు, ఏఈలతో టెలికాన్ఫరెన్స్‌ను విద్యుత్ భవన్ నుంచి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడారు. కలెక్టర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది వారికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించారు. సిబ్బందికి సెలవులను రద్దు చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందితో పాటు జేఈని ఏర్పాటు చేశామన్నారు.

రెండు శాఖలకు ఇన్‌చార్జిగా డీఆర్డీఏ పీడీ



సాంబశివారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిగా పనిచేస్తున్న వెంకటయ్య ఆ రెండు శాఖలతో పాటు సెట్నెల్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు. శనివారం ఆయన ఉద్యోగ విరమణ పొందడంతో ఈ బాధ్యతలను సాంబశివారెడ్డికి అప్పగిస్తూ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. బీసీ సంక్షేమాధికారి బాధ్యతలను నెల్లూరు సహాయ బీసీ సంక్షేమాధికారి ప్రసన్నకు, సెట్నెల్ సీఈఓ బాధ్యతలను డీఎస్డీఓ యతిరాజ్‌కు అప్పజెప్పారు.